క్లుప్తంగా

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించే దిశగా సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోరి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా నగరంలోని సర్కిల్-1, సర్కిల్-2, సర్కిల్-3 జోనల్ కార్యాలయాల్లోనూ ప్రజా ఫిర్యాదులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. నగర పాలక సంస్థకు సంబంధించిన సమస్యలను ప్రజలు తమకు దగ్గరలో ఉండే కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీల రూపంలో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. అధికారులందరూ జోనల్ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు సీఐ చిన్న కొండలరావు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సీఐ కొండలరావు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల్లో రౌడీషీటర్లు పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రశాంత జీవనానికి విఘాతం కలిగించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయడంతో పాటు నగర బహిష్కరణ వేటు వేస్తామని చెప్పారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, గొడవలను ప్రోత్సహించినా వారిపై చర్యలు తప్పవన్నారు. అదే విధంగా గంజాయి వంటి మత్తు పదార్థాల అమ్మకాలపై ఎటువంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన శ్రీచిన్న జీయర్ స్వామి నృత్య కళాక్షేత్రంకు చెందిన కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్యాచార్య జి.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో 22 మంది కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ఆలయ అధికారులు ప్రసాదాలను అందచేశారు.

ప్రమాదాల అడ్డా.. కొత్తపేట కొండ

- జారటానికి సిద్ధంగా ఉన్న రిటైనింగ్ వాల్స్
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఆందోళనలో స్థానిక ప్రజానీకం





ఆందోళన వ్యక్తం చేస్తున్న కొండ ప్రాంత వాసులు (ఇన్‌సెట్) కొత్తపేట కొండ ప్రాంతంలో ప్రమాదభరితంగా ఉన్న రిటైనింగ్ వాల్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట 51వ డివిజన్‌లోని పలు కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ ప్రమాదభరితంగా మారాయి. పాతబస్తీలోని కొత్తపేట పరిసర ప్రాంతాల్లో విస్తరించి ఉన్న డివిజన్‌లో రిటైనింగ్ వాల్స్ పరిస్థితి దారుణంగా ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానిక ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొండ ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రధానంగా నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఆయా కొండ ప్రాంతాల్లోని రిటైనింగ్ వాల్స్ ఎప్పుడు కూలుతాయోనని బిక్కు బిక్కు మంటూ జనం కాలం వెళ్లదీస్తున్నారు.

వర్షాకాలం మరింత భయం.....

ప్రస్తుతం వేసవి కాలం కొనసాగుతున్నా వర్షాలు కురవటం ప్రారంభమైంది. భారీగా కురుస్తున్న వర్షాలతో స్థానిక ప్రజానీకం మరింత భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఇదే డివిజన్‌లో పలు చోట్ల కొండచరియలు కూలటంతో స్థానిక నివాసితులు తీవ్రంగా నష్టపోయారు. అదే తీరులో ప్రమాదంగా ఉన్న రిటైనింగ్ వాల్స్ కూలితే పరిస్థితి దారుణంగా ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా కొండ ప్రాంతంలోని అడ్డరోడ్డును అనుకొని ఉన్న పలు ప్రాంతాల్లో ఈ విధమైన ప్రమాదకరమైన రిటైనింగ్ వాల్స్ దర్శనమిస్తున్నాయి.

నడవటానికి సైతం వెనుకడుగు....

పలు ప్రాంతాల్లో ఉన్న రిటైనింగ్ వాల్స్ సమీపంలో నడవాలంటే స్థానిక ప్రజానీకం తీవ్ర భయానికి గురవుతున్నారు. అటుగా రాకపోకలు సాగించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. కానీ ఉపాధి అవసరాలకు వెళ్లాల్సి ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నామని అంటున్నారు. ప్రమాదభరితంగా ఉన్న రిటైనింగ్ వాల్స్ గురించి అధికార యంత్రాంగానికి ఎన్ని మార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని కొండ ప్రాంత నివాసితులు మండి పడుతున్నారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రిటైనింగ్ వాల్స్ నిర్మించాలి



కొత్తపేట కొండ ప్రాంతంలో ప్రమాదభరితంగా ఉన్న రిటైనింగ్ వాల్స్ స్థానంలో కొత్తవి నిర్మించాలి. పలు ప్రాంతాల్లో జారిపోవటానికి సిద్ధంగా ఉన్నవాటిని తక్షణం తొలగించాలి. వీటిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం ఉండటం లేదు. రానున్నది వర్షాకాలం కనుక వెంటనే అధికారులు దీనిపై దృష్టి పెట్టాలి.

–కె.సూరిబాబు, స్థానిక నివాసితుడు

ఇంద్రకీలాద్రిపై సూర్యోపాసన సేవ



సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కళ్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు సూర్య భగవానుడి చిత్రపటానికి పూల మాల వేసి పూజలు నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు. సూర్య భగవానుడిని ఆరాధించడం ద్వారా మానవుడికి ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం భక్తులకు రవ్వకేసరి ప్రసాదం పంపిణీ చేశారు. ఇంద్రకీలాద్రిపై ఆదివారం శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు పలు ఆర్జిత సేవలను నిర్వహించారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, ఉదయం 7-30 గంటలకు లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కళ్యాణం, చండీహోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. ఆయా ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

ఆకలి తీర్చడం మహత్కార్యం



హజరత్తయ్యగుప్తాను సత్కరిస్తున్న దృశ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆకలిగా ఉన్నవారికి ఆహారం అందించడం ఎంతో మహత్కార్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అన్నసంతర్పణ సమితి నాలుగో వార్షికోత్సవం వన్‌టౌన్‌లోని పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.స్రవంతి రాయ్, ప్రముఖ కళాపోషకులు హజరత్తయ్య గుప్తా, రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్, వాసవీ సంస్థల ప్రతినిధి వంకదారు వాసుదేవరావు ప్రసంగించారు. పేదలకు, ఆకలిగా ఉన్నవారికి ఆకలి తీర్చటమే ధ్యేయంగా 'అన్న సంతర్పణ సమితి ట్రస్ట్' ఏర్పాటు చేశామని చెప్పారు. ట్రస్ట్ ద్వారా పేదల ఆకలి తీరుస్తున్న ట్రస్ట్ సభ్యుల మానవత్వాన్ని కొనియాడారు. ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో అన్నార్తులను గుర్తించి వారి ఆకలి తీర్చాలన్న లక్ష్యం నుంచి ట్రస్ట్ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. నేడు 220 మంది శాశ్వత సభ్యులు, 150 మంది వలంటీర్లు ట్రస్టు ద్వారా అవసరమైన వారికి నిత్యం అన్నదానం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ తూనుగుంట్ల శ్రీధర్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అన్నం సాయి సునీత, ట్రస్ట్ కార్యదర్శి పీఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నగరాల అన్న సత్రం కార్యాలయం ప్రారంభం



పాల్గొన్న నగరాల సంఘ ప్రముఖులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీశైలంలోని శ్రీశైల క్షేత్ర భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్ల నగరాలు కులస్తుల నిత్య అన్నదాన వసతి సత్రం బ్రాంచ్ కార్యాలయం విజయవాడ కొత్తపేటలో ఆదివారం ప్రారంభించారు. తొలుత ఈ కార్యాలయాన్ని కమిటీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కొరగంజి జగన్నాథరావు పాత్రుడు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైల పుణ్యక్షేత్రంలో నగరాలకు చక్కటి వసతి సౌకర్యం కలుగజేయాలనే లక్ష్యంతో తాము కమిటీని ఏర్పాటు చేసి శ్రీశైల పుణ్యక్షేత్రంలో సత్రం నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. శ్రీశైలం క్షేత్రం సత్రంలో వసతి సౌకర్యం కావాల్సిన వారు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. అలాగే వసతి సత్రం నిర్మాణానికి విరాళాలు ఇవ్వగోరే దాతలు కూడా తమను సంప్రదించాలని తెలిపారు. అలాగే త్వరలో జరగనున్న చిట్టినగర్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కమిటీ ఎన్నికల్లో తాము కూడా తమ ప్యానల్ తరపున పోటీ చేయనున్నట్లు చెప్పారు. ఒకవేళ నగరాల కులస్తులందరూ ఏకగ్రీవంగా కమిటీని ఏర్పాటు చేయదలిస్తే తాము కూడా సిద్ధమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నగరాల సంఘ ప్రముఖులు గుజ్జారి అమర్, పోతిన వర ప్రకాష్, కామందుల నరసింహారావు, మజ్జి ఈశ్వరరావు, ఏనుగుల అప్పారావు, రాంపిళ్ళ రవి, పొట్నూరి రాజా, మజ్జి శ్రీనివాసరావు, ముదిలి చక్రపాణి, కొరగంజి భాస్కరరావు, బాయన శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సత్యవతి కథలు వాస్తవ జీవిత దర్పణాలు

విజయవాడ కల్చరల్: పీ సత్యవతి కథలు వాస్తవ జీవిత దర్పాణాలు అని కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్ అన్నారు. సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో కథాసంధి కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని శిఖరా స్కూల్లో ఆదివారం సత్యవతితో ముఖాముఖి ఆమె సాహిత్య ప్రయాణం అంశంగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ సత్యవతి తన చుట్టూ మహిళలపై జరుగుతున్న అన్యాయాలను తన వాదనను బలంగా వినిపించారు. చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా చెబుతారన్నారు.

'కుటుంబంనుంచే నా కథలకు ప్రేరణ'

సత్యవతి మాట్లాడుతూ 'కుటుంబం నుంచే నా కథలకు ప్రేరణ కలిగింది' అని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న అనేక సంఘటనలే నా కథలకు ప్రేరణ అన్నారు. ఆ సంఘటనలే ప్రేరణ కలిగించాయన్నారు. తన సాహిత్య జీవితానికి గ్రంథాలయాలు పునాదులన్నారు. తన కథలను పాఠకులు ఆదరించారన్నారు. ఆమె రాసిన కథలలోని పాత్రలను వాటి నేపథ్యం వినిపించారు. ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు తన దైన రీతిలో సమాధనమిచ్చారు. కార్యక్రమంలో శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు, విద్యావేత్త బండ్ల మాధవరావు, యువ కవి అనిల్ డ్యానీ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఖాదర్‌మొహిద్దీన్‌తోపాటు నగరానికి చెందిన సాహితీవేత్తలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యంపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ జక్కంపూడిలోని వైఎస్సార్ కాలనీలో కోరాడ అనురాధ, మురళీకృష్ణ నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కుమార్తె నిత్యశ్రీ (19) నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తుంటుంది. వీరితో పాటు మురళీకృష్ణ తల్లి రాజేశ్వరి కలిసి ఉంటుంది. శనివారం రాత్రి నిత్యశ్రీ నానమ్మతో కలిసి గదిలో నిద్రపోయింది. అర్ధరాత్రి దాటిన తర్వాత రాజేశ్వరి తన కొడుకు, కోడలి వద్దకు వెళ్లి గదిలో నిత్యశ్రీ లేదని చెప్పింది. దీంతో చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోంది

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు



వెన్నుపోటు దినం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ఏడాది నుంచి రాక్షస పాలన నడుస్తోందని, కేవలం లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగమే అమలవుతోందని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. భవానిపురం శివాలయం సెంటర్‌లోని వైఎస్సార్ సీపీ నాయకుడు కొనకళ్ల విద్యాధరరావు నివాసంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 4న జరపతలపెట్టిన వెన్నుపోటు దినం వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు, పార్టీ నేతలతో కలిసి వెలంపల్లి శ్రీనివాసరావు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. 4న జరిగే వెన్నపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారం చేపట్టి ఏడాది గడిచినా ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019లో అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే మేనిఫెస్టోలో ఇచ్చిన 90 శాతం హామీలను అమలు చేశారన్నారు.

కూటమిది ప్రజా వ్యతిరేక పాలన

కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందన్నారు. ఏడాది నుంచి ప్రతి మంగళవారం అప్పులు చేస్తున్న కూటమి ప్రభుత్వం ఆ అప్పులను దేనికి వినియోగించిందో చెప్పాలన్నారు. నమ్మిన ప్రజలకు మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూన్ 4న కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా వెన్నుపోటు దినం పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 40వ డివిజన్ బ్యాంక్ సెంటర్ వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. అక్కడ నుంచి పశ్చిమ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బండి పుణ్యశీల, మండేపూడి చటర్జీ, యరడ్ల ఆంజనేయరెడ్డి, పడిగపాటి చైతన్య రెడ్డి, బాపతి కోటి రెడ్డి, యలకల చలపతిరావు, నాయకులు తంగెళ్ల రామచంద్రరావు, కర్నాటి రాంబాబు, మనోజ్ కొఠారి, గౌస్ మొహిద్దీన్, షేక్ హయత్, గోదావరి బాబు, దాసి జయప్రకాష్ కెన్నడీ, తోలేటి శ్రీకాంత్, బొందిలి నరేంద్ర సింగ్, బూదాల శ్రీనివాసరావు,కేసరి కృష్ణ రెడ్డి, బాజీ బాబా,నజీర్, దొడ్డా రాజశేఖర్ రెడ్డి,అబ్దుల్ ఘని చిచ్చా, సయ్యద్ అతీక్, కేసరి సుబ్బా రెడ్డి, మజ్జి శ్రీనివాసరావు, వీరజల లీల మధు, పొదిలి చంటి, పదిలం రాజశేఖర్, షేక్ మస్తాన్, తనబుద్ధి చంద్రశేఖర్ రెడ్డి, మెట్టు వెంకట రెడ్డి, నారాయణ బాబు, ఐతా కిశోర్, దేరంగుల రమణ, శీరం వెంకటరావు, కూరాకుల నాగ, హాబిబుల్లా, డీవీ రెడ్డి, పెద్ది సత్య సాయిబాబు, శరగడ శంకర్ రెడ్డి, వెన్నం రజని, పిళ్ల సూరిబాబు, తుపాకుల గురుమూర్తిరెడ్డి, గురుమాహంతు మహేష్, బొమ్ము మధు, గ్రంధి రమేష్ పాల్గొన్నారు

రేషన్ డిపోలలో అన్ని సరుకులు అందించాలి

వించిపేట(విజయవాడపశ్చిమ): రేషన్ డిపోలలో అన్ని రకాల నిత్యవసర సరుకులు అందించాలని 50వ డివిజన్ సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం డివిజన్‌లో రేషన్ డిపోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసర ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో రేషన్ డిపోల ద్వారా నాణ్యమైన బియ్యం, కందిపప్పు, పంచదార, పామాయిల్, చింతపండు తదితర నిత్యవసరాలు అందించాలని కోరారు. ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు డిపోల వద్దకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. అటువంటి వారి కోసం రేషన్ వాహనాలతో నేరుగా వారి ఇళ్లవద్దకే రేషన్ అందించాలని చెప్పారు. అదే విధంగా రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల నుంచి రేషన్ విడుదల చేసి కార్డులు జారీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.ఆదిలక్ష్మి, వి.రమేష్, ఎండి రిజ్వాన్, షేక్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కోసం పరేషాన్!

భవానీపురం ఊర్మిళానగర్‌లో రేషన్ దుకాణం వద్ద బారులుతీరిన లబ్ధిదారులు



కండ్రిక ప్రాంతంలో రేషన్ కోసం వేచి ఉన్న కార్డుదారులు





జక్కంపూడి కాలనీలో బియ్యం బస్తా తలపై పెట్టుకొని బురదరోడ్డులో తీసుకెళ్తున్న మహిళ

రేషన్ కోసం పేదలు పరేషాన్ అవుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు కొత్త కష్టాలు తెచ్చి పెట్టింది. ఎండీయూ వాహనాలు రద్దు చేసి పాత పద్ధతిలో రేషన్ దుకాణాల్లో నిత్యావసరాల పంపిణీని ఆదివారం నుంచి ప్రారంభించింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కార్డుదారుల ఇంటికే ఎండీయూ వాహనాలు వచ్చి రేషన్ బియ్యం అందించారు. దీంతో వృద్ధులు, వికలాంగులు, నడవలేని వాళ్లు, అనారోగ్యంతో ఉన్న వాళ్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ బియ్యం పొందారు. ఇప్పుడు వాహనాలు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రేషన్ దుకాణాల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. తొలిరోజే నగరంలోని అనేక ప్రాంతాల్లో సర్వర్ పని చేయక ప్రజలు అవస్థలు పడ్డారు. రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



విద్యాధరపురం చెరువు సెంటర్‌లో దుకాణం వద్ద రేషన్ తీసుకెళ్తున్న వృద్ధుడు



సర్వర్ మొరాయించడంతో బయటే వేచి ఉన్న కార్డుదారులు



రామలింగేశ్వరనగర్‌లో చిన్నారిని ఒడిలో పెట్టుకొని వేచి ఉన్న తల్లి

రేషన్ కార్డుదారులకు మళ్లీ కష్టాలు మొదలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయు వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో రేషన్ కార్డుదారుల కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎండీయూ వాహనాల ద్వారా పేదలు, వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే వచ్చి రేషన్ సరఫరా చేసే విధానాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారు. ఆ పథకాన్ని కొనసాగించకూడదని, జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన ముద్ర చెరిపేయాలన్న కక్ష సాధింపుతో రేషన్ షాపులను పునఃప్రారంభించాటాన్ని పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలకంటే మెరుగైన పథకాలు అందిస్తామని ఎన్నికలకు ముందు చెప్పి ఇప్పుడు ఆర్థిక ఇబ్బందుల సాకుతో మళ్లీ రేషన్ దుకాణాలను పునఃప్రారంభించటంపై లబ్ధిదారులు మండి పడుతున్నారు. ఈ ప్రభుత్వానికి ఎందుకు ఓటు వేశామా అని ప్రజలు బాధపడుతున్నారు. ఉదయం పనుల్లోకి వెళితే తిరిగి సాయంత్రానికి ఇంటికి చేరుకుంటామని, కాసేపు సేదతీరటం, ఇంట్లో పనులు చేసుకునే అవకాశం లేకుండా హడావుడిగా మళ్లీ రేషన్ షాపులకు వెళ్లి క్యూలైన్‌లో నిలబడి బియ్యం తెచ్చుకోవాల్సి వస్తుందని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 4 గంటలు, సాయంత్రం 4 గంటలు రేషన్ షాపులోనే ఉండే డీలర్లు దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్ ఎంత వరకు అందించగలరనేది ప్రశ్నార్థకమే. కాగా గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయు వాహనాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న 18 వేల కుటుంబాలను ఈ రోజు రోడ్డున పడేసిన ఘనత చంద్రబాబు కూటమి ప్రభుత్వానిదేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పొదిలి చంటిబాబు ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించిన చంద్రబాబు ఉన్న ఉద్యోగులనే తొలగించటం హాస్యాస్పదంగా ఉందన్నారు.